ప్రతీ సోమవారం ప్రజావాణి

ధారూరు, జూన్ 30: ధారూరు మండల పరిషత్తు కార్యాలయంలో ప్రతీ సోమవారం ప్రజావాణి నిర్వహిస్తామని ఎంపీడీవో నర్సింహులు తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేస్తున్న ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన దరఖాస్తులను సంబంధితశాఖల అధికారులకు పంపించి పరిష్కారిస్తామని చెప్పారు. ప్రజావాణిని నేటి (సోమవారం) నుంచి ప్రారంభిస్తామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి 21 మంది ఎంపిక

మేడ్చల్ జూన్ 30(ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నుంచి 21 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వీరిలో 13 మంది బాలురు, 8 మంది బాలికలున్నారు. తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ నాలుగో తరగతిలో ప్రవేశాల కోసం ఈ నెల 29న హకీంపేట క్రీడా పాఠశాలలో ఎంపిక నిర్వహించగా జిల్లా నుంచి 21మంది సెలెక్ట్ అయ్యారు. వీరికి జూలై 11న రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహించి తుది ఎంపిక చేయనున్నట్లు ఆదివారం యువజన, క్రీడలశాఖ అధికారి జి.వి.గోపాల్ తెలిపారు.

గ్రంథాలయాల్లో ఖాళీల భర్తీకి కృషి

- రాష్ట్ర పౌర గ్రంథాలయాలశాఖ డైరెక్టర్ ఏవీఎన్ రాజు



మాట్లాడుతున్న ఏవీఎన్ రాజు

వికారాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గ్రంథాలయ పరిషత్, జిల్లా గ్రంథాలయ సంస్థలకు పాలకవర్గాలు ఏర్పాటైన తరువాత గ్రంథాయాల్లో ఖాళీల భర్తీకి ప్రభుత్వాన్ని ఒప్పించి ఉద్యోగ నియామకాలు చేపట్టే విధంగా కృషి చేస్తామని, పౌర గ్రంథాలయాల్లో నెలకొన్న సిబ్బంది కొరత సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని పౌర గ్రంథాలయాలశాఖ రాష్ట్ర డైరెక్టర్ ఏవీఎన్ రాజు తెలిపారు. వికారాబాద్‌లోని జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని ఆదివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్ర గ్రంథాలయంలో వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగులతో ఆయన మాట్లాడారు. సదుపాయాలు, స్టడీ మెటీరియల్ గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పౌర గ్రంథాలయాల్లో ఉద్యోగుల కొరత తీవ్రంగా ఉందన్నారు. రాష్ట్రంలోని 571 గ్రంథాలయాల్లో 1039 మంది ఉద్యోగులు పనిచేయాల్సి ఉండగా ప్రస్తుతం 387 మంది మాత్రమే ఉన్నారన్నారు. గ్రంథాలయాల్లో నెలకొన్న ఖాళీలను చాలా కాలంగా భర్తీ చేయకపోవడంతో గ్రంథాలయాల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. గ్రంథాలయాల్లో ఉద్యోగ నియామకాలు, సొంత భవనాలు చేపట్టడానికి ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. గ్రంథాలయాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కుర్చీలు, తాగునీరు, ఫ్యాన్లు తదితర సదుపాయాలు కల్పిస్తున్నామని, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువకులు, పాఠకులు కోరిన పుస్తకాలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా గ్రంథపాలకుడిగా నియామకమైన తనకు ఉద్యోగోన్నతిపై పౌర గ్రంథాలయ శాఖ డైరెక్టర్‌గా అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో సంస్థ వికారాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల కార్యదర్శులు సురేష్‌బాబు, మనోజ్‌కుమార్, బుగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మరో మూడు రోజులే!


- ముగియనున్న జడ్పీ, మండల పాలకవర్గాల గడువు
- 15వ ఆర్థిక సంఘం నిధుల కోసం ఎదురుచూపులు

మేడ్చల్ జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా, మండలపరిషత్ పాలకవర్గాల గడువు మరో మూడు రోజుల్లో ముగియనుంది. మండల, జిల్లాపరిషత్ ప్రజాప్రతినిధులు ప్రతిపాదించిన పనులకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కాకపోవడంతో సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పదవీకాలం ముగిసేలోగా నిధులు వస్తే పనులు చేపట్టాలని ప్రజాప్రతినిధులు ఆశగా ఎదురుచూస్తున్నారు. జూలై 4, 5 తేదీలలో మండల, జిల్లా పరిషత్ పాలకవర్గాల గడువు ముగియనుంది. 2023-24కు సంబంధించి మొదటి విడత నిధులు విడుదలయ్యాయి. రెండో విడతవి రాకపోవడంతో తమ పదవీకాలం ముగిశాక నిధులు వస్తే ఎలా? అని సభ్యులు ఆందోళన చెందుతున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లా, మండల పరిషత్‌లు పనులు ప్రతిపాదనలు తయారు చేసి పాలకవర్గాల ఆమోదంతో నిధుల విడుదల కోసం పంపించారు. విడుదల చేస్తే కొత్తపనులు ప్రారంభించవచ్చనే ఆశతో ఉన్నారు.కేంద్రం మాత్రం 15వ ఆర్థికసంఘం నిధులు ఏటా కేటాయిస్తోంది. ఆ నిధులతోనే గ్రామాల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు మౌలిక సదుపాయాల కోసం పనులు చేపడుతున్నారు. ఈ ఏడాదికి సంబంధించి కేటాయించిన పనులు గ్రామాల్లో కొనసాగుతున్నాయి.

విడుదలైన నిధుల వరకే పనులు : దిలీప్, జడ్పీ సీఈవో

2023-24కు సంబంధించి పనులు జరుగుతున్నాయి. 15వ ఆర్థిక సంఘానికి సంబంధించి మొదటి విడత నిధులు విడుదలయ్యాయి. ఆ నిధుల వరకు మాత్రమే పనులు జరుగుతున్నాయి. మిగిలినవి కూడా వస్తాయని సమాచారముంది. 2024-25 నిధులు జూలై నెలాఖరుకు వచ్చే అవకాశముంది.

ముసురు వానలు.. పల్లెలు, పట్టణాలన్నీ వరద నీటితో నిండిపోతున్నాయి. మొత్తం బురదమయంగా మారాయి. రోడ్లపై ఉన్న గుంతల్లో నీళ్లు నిలిచాయి. బ్యాక్టీరియా, వైరస్‌లు, ఫంగస్, దోమలు వృద్ధి చెందటానికి అనువైన కాలం. గుంతలు, మురుగుకాల్వల్లో, రహదారుల పక్కన నిలిచే నీరు దోమలకు ఆవాసంగా మారుతోంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో పారిశుధ్యలోపంతో ఈగలు, దోమలకు తోడు వర్షాకాలంలో సహజంగా వచ్చే జలుబు, విషజ్వరాలు జడలు విప్పుతున్నాయి. జనంపై తమ ప్రతాపాన్ని చూపుతున్నాయి. వాటి ధాటికి తట్టుకోలేక మంచాన పడుతున్నారు. జ్వరాల బారిన పడి ప్రజలు ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు.



సీజనల్ పంజా!

ముసురుతున్న వ్యాధులు

- వర్షాకాలం.. వ్యాపిస్తున్న విష జ్వరాలు
- తాగునీరు కలుషితం.. పరిసరాల అపరిశుభ్రతే కారణం
- దోమలతో వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువ
- మేడ్చల్ జిల్లాలో పెరుగుతున్న డెంగీ కేసులు
- పడకేసిన పారిశుధ్యం, రోగాల బారిన ప్రజలు
- గతేడాది 745 డెంగీ కేసులు
- ఈ ఏడాది ఇప్పటి వరకు 75 కేసులు నమోదు

మేడ్చల్(ఆంధ్రజ్యోతి) జూన్ 30: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో వ్యాధులు ముసుకురుకుంటున్నాయి. ఇటీవల కురుస్తున్న మోస్తరు నుంచి భారీ వర్షాలతో పల్లెలు, పట్టణాల్లో పారిశుధ్యం పడకేసింది. డ్రైనేజీలు, వీధుల్లో మురుగు పేరుకుపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమలతో సీజనల్ వ్యాధులు ప్రబలి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడ చూసినా ఆస్పత్రులకు రోగులు క్యూ కడుతున్నారు. జ్వరాల బారిన పడి ప్రజలు ఆసుపత్రులపాలవుతున్నా.. దోమలను నిర్మూలించే చర్యలు చేపట్టడంలో పాలకవర్గం, అధికారులు విఫలమయ్యారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దోమల నివారణ చర్యలు చేపట్టడం లేదు. ఫాగింగ్ మిషన్‌లు మూలకు పడ్డాయి. ప్రస్తుతం జిల్లాలో జ్వరం కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. వేసవి ఎండలు తగ్గిపోవడం... తొలకరి వర్షాలతో విష జ్వరాలు ప్రబలే ప్రమాదముంది. ఈ ఇదే సమయంలో ప్రజానీకం అప్రమత్తంగా వ్యవహరించవలసిన అవసరం ఉంది. మేడ్చల్ జిల్లాలో డెంగీ పంజా విప్పుతోంది. గతేడాది 745 డెంగీ కేసులు నమోదు కాగా, ఈ ఏడాది ఇప్పటి వరకూ 75 కేసులు నమోదయ్యాయి. జిల్లాలో అనేక గ్రామాల ప్రజలు అతిసారం బారినపడి ఆసుపత్రుల పాలవుతున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. కలుషితనీరు, కలుషిత ఆహారపదార్థాల కారణంగా ప్రబలే ఈ వ్యాధిని నివారించడానికి అధికారులు సలహాలు, సూచనలు ఇవ్వడం విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆస్పత్రుల బాట..

పట్టణాలు, పల్లెలు తేడా లేకుండా జ్వరాలు సోకుతుండడంతో బాధితులు ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. డెంగీతో పాటు టైఫాయిడ్, మలేరియా జ్వరాలు విజృంభిస్తున్నాయి. చాలా మంది కీళ్ల నొప్పులు, ఒంటి నొప్పులు, జలుబు, దగ్గు, జ్వరంతో ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు.

రోగాల లక్షణాలు

వర్షాకాలంలో డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, ఉదర ఇన్‌ఫెక్షన్లు, లెప్టోస్పిరోసిస్, కలరా, టైఫాయిడ్, వైరల్ జ్వరం, అతిసారం, ఇన్‌ఫ్లుయెంజా వంటి జబ్బులు సోకుతాయి. వీటివల్ల దీర్ఘకాలిక జ్వరం, దద్దుర్లు, తలనొప్పి, ప్లేట్లెట్‌తగ్గటం, సున్నితత్వం, వాపులు, అలసట, చలి, కీళ్లనొప్పి, శరీరనొప్పులు, చెమటలు పట్టడం, తీవ్రమైన రక్తహీనత, అల్ప రక్తపోటు, కండరాల తిమ్మిరి, దాహం , చర్మం పాలిపోవటం, హృదయ స్పందన రేటు పెరుగుదల, బలహీనత, వాంతులు, మలబద్ధకం, ఫారింక్స్ వాపు, వదులైన నీటిమలం, వికారం, మలంలో రక్తం, ముక్కుదిబ్బడ, గొంతుమంట, నిరంతర దగ్గు, కళ్లు ఎరుపు వంటి లక్షణాలు కనిపిస్తాయి.

డెంగీ పంజా...

డెంగీ సోకుతుండడంతో మేడ్చల్ జిల్లాలో జనం బెంబేలెత్తుతున్నారు. ఈవ్యాధి సోకిన వారు తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో పాటు మరణాలు కూడా సంభవిస్తుండడంతో జనం ఆందోళన మరింత తీవ్ర తరమవుతోంది. ఈ ఏడాది ఇప్పటికే 75 డెంగీ కేసులు నమోదయ్యాయి.

జాగ్రత్తలు తీసుకోవాలి



వర్షాకాలంలో కీటక, నీటిజనిత వ్యాధులు ఎక్కువగా సంభవిస్తాయి. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి. దోమల వృద్ధిని అరికట్టాలి. ఇళ్లలో దోమ తెరలు, లేపనాలు వంటివి వాడాలి. నీటి గుంతల్లో కిరోసిన్ చల్లాలి. పరిసరాల్లో మురుగునీరు నిలవకుండా చూసుకోవాలి. కలుషిత ఆహారం, నీరు తీసుకోకూడదు. రోగనిరోధకశక్తిని పెంచే ఆహారం భుజించాలి. వేడి చేసి కాచి చల్లార్చిన నీటిని తాగాలి. చల్లటి పదార్థాలకు దూరంగా ఉండాలి.

- రఘునాథస్వామి, మేడ్చల్ జిల్లా వైద్యాధికారి

కారణాలు అనేకం..

వర్షాకాలంలో అత్యంత సాధారణ వ్యాధి డెంగీ, టైగర్ దోమ కారణంగా వ్యాపిస్తుంది. వీటిలో పులిఏడెస్ అల్బోపిక్టస్ వల్ల చికున్‌గున్యా వస్తుంది. సహజంగా వానాకాలంలో పరిసరాల్లో నీటి నిల్వలు ఉంటాయి. ఆయా చోట్ల వృద్ధి చెందే దోమలు కుట్టడంతో మలేరియా ప్రబలుతుంది. కలుషిత ఆహారం, నీటి కారణంగా వివిధ రకాల వ్యాధులు సోకుతాయి. వాటిలో అత్యంత అంటువ్యాధిగా చెప్పుకునే టైఫాయిడ్ ఒకటి. సాధారణమైన ఆరోగ్య సమస్యల్లో ఒకటైన అతిసారమూ వీటి కారణంగా సంభవిస్తుంది. తాత్కాలిక పరిస్థితి నుంచి ప్రాణాపాయం వరకు దారితీస్తుంది. మరోవైపు కడుపు ఇన్‌ఫెక్షన్లకు అపరిశుభ్రమైన ఆహారం, బయట పదార్థాలు, ద్రవపదార్థాలు కారణం. గ్యాస్ట్రోఎంటెరిటిస్ అనేది ఈ సీజన్‌లో వచ్చే ఇన్‌ఫెక్షన్. వైరల్ జ్వరం ఏడాది పొడవునా వ్యాపించినా వర్షాకాలంలో ఎక్కువగా కనిపిస్తోంది. వాతావరణంలో మార్పులు, ఉష్ణోగ్రతలో హెచ్చుతగ్గుల కారణంగా ఇన్‌ఫ్లూయెంజా సోకుతుంది. వైరల్ ఇన్‌ఫెక్షన్ ఒకరి నుంచి మరొకరికి సోకే ప్రమాదముంది. వృద్ధులు, అస్తమా బాధితులు, పిల్లల్లో ఊపిరితిత్తుల సమస్యలు తలెత్తుతున్నాయి. అసాధారణమైన బ్యాక్టీరియా కారణంగా లెప్టోస్పిరోసిస్ వ్యాధి సంక్రమిస్తుంది. జంతువుల నుంచి మానవులకు సోకుతుంది. శరీరంపై గాయాలు, కోతలు ఉన్నట్లయితే బయటకు వెళ్లేప్పుడు వాటిని కవర్ చేయడం శ్రేయస్కరం. ఎలాంటి వైరల్ జ్వరం సోకినా ప్లేట్‌లెట్స్ తగ్గుతాయి. ఆసుపత్రిలో చేరి చికిత్స పొందాల్సిన పరిస్థితులు తలెత్తుతాయి.

పైగా దీని చికిత్స కోసం ఆసుపత్రుల్లో చేరితే లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. అందుకే డెంగీ అంటేనే జనం భయపడుతున్నారు. పారిశుధ్య చర్యలు సరిగా లేకపోవడంతో ఈ వ్యాధి మరింతగా విజృంభిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

పనిచేయని ఫాగింగ్ యంత్రాలు

ఫాగింగ్ యంత్రాలు నిరుపయోగంగా మారిపోయాయి. మున్సిపాలిటీలతో పాటు గ్రామ పంచాయతీల్లో ఫాగింగ్ మిషన్‌లు అందుబాటులో ఉన్నప్పటికీ అవసరమైన సామగ్రి లేక మూలనపడ్డాయి. ఇప్పటికైనా పాలక వర్గం, అధికారులు స్పందించి దోమల నివారణ చేపట్టడంతో పాటు పారిశుధ్య పనులను చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



తాండూరు నంబర్ వన్ హైస్కూల్ వద్ద నిలిచిన వరద నీరు

జలమయం!

- వికారాబాద్ జిల్లాలో మోస్తరు నుంచి భారీ వాన
- తాండూరులో 52.8 మిమీ వర్షపాతం నమోదు
- నీటమునిగిన లోతట్టు ప్రాంతాలు
- ఇళ్లల్లోకి వర్షపు నీరు.. ఇబ్బందులు పడిన జనం
- వికారాబాద్‌లో కూరగాయ రైతుల ఇబ్బందులు
- వాడుతున్న మొలకలకు జీవం


వికారాబాద్ (ఆంధ్రజ్యోతి)/తాండూరు/యాలాల/వికారాబాద్/ధారూరు/బషీరాబాద్/పరిగి/బొంరాస్‌పేట్/కొడంగల్/కులకచర్ల, జూన్ 30 : వికారాబాద్ (ఆంధ్రజ్యోతి) : వికారాబాద్ జిల్లాలో ఆదివారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. తాండూరు, ధారూరు, పెద్దేముల్, బొంరాస్‌పేట్, యాలాల్, పరిగి, వికారాబాద్ మండలాల్లో భారీ వర్షం కురియగా, మిగతా మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. తాండూరులో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. మున్సిపాలిటీ పరిధిలోని లోతట్టు ప్రాంతాలైన భవానీనగర్, మిత్ర నగర్, గ్రీన్‌సిటీ, సెయింట్ మార్క్స్ హైస్కూల్ ఏరియా, ముత్యాలగల్లీ, చెంగోల్ బస్తీ ప్రాంతాలు జలమయమయ్యాయి. వరద నీరు ఇళ్లలోకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. భవాని నగర్ ప్రాంతంలో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. చెరువులు, వాగులోకి వర్షపు నీరు చేరింది. గ్రీన్‌సిటీ, మార్కెండేయ టెంపులు,మిత్రనగర్ ప్రజలు ఇబ్బందులు పడ్డారు. యాలాల మండంలో భారీగా వర్షం కురిసింది. పరిగి, ధారూరు, వికారాబాద్, బషీరాబాద్ తదితర మండలాల్లో మోస్తరు వాన పడింది. ధారూరు మండలంలో వానాకాలం ప్రారంభమైనప్పటి నుంచి ఇదే వాన పెద్దవాన పడినట్లయింది. మొలకెత్తిన మొక్కలకు మేలు చేకూరిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.వికారాబాద్ జిల్లా కేంద్రంలో భారీ వర్షం కురిసింది. వికారాబాద్ రైతు బజారులో రైతులకు సరిపడా స్థలం లేక రైతులు రోడ్లపై కూరగాయలు విక్రయిస్తుంటారు. భారీ వర్షం కురియడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. వర్షం కురిసినప్పుడల్లా రైతుబజారు చిత్తడిగా మారినా మార్కెట్ అధికారులు మాత్రం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. బషీరాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో కురిసిన వర్షం రైతన్నలకు సంతోషాన్ని కలిగించింది. పలు గ్రామాల్లో అంతర్గత రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఎట్టకేలకు కురిసిన వర్షం పంటలకు జీవం పోసిందని రైతులు సంబరపడ్డారు. బొంరాస్‌పేట్, కొడంగల్ మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. కంది, పత్తి, పెసర, మినుము విత్తనాలు విత్తారు. మొలకెత్తిన మొక్కలు వాడిపోతున్న తరుణంలో కురిన వర్షం జీవం పోసినట్లైంది. కులకచర్ల, చౌడాపూర్ మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది.

తాండూరులో 52.8 మిమీ. వర్షం

జిల్లాలో అత్యధికంగా తాండూరులో 52.8మిమీ వర్షం కురియగా, తాండూరు ఏఆర్ఎస్‌లో 30.5మిమీ, పెద్దేముల్‌లో 26.8మిమీ, ధారూరులో 23.8మిమీ, బొంరాస్‌పేట్‌లో 23.0మిమీ, వికారాబాద్‌లో 21.3మిమీ, యాలాల్‌లో 18.8మిమీ, పరిగిలో 17.8మిమీ, దావలాపూర్‌లో 17.6 మిమీ, మద్గుల్ చిట్టంపల్లిలో 15.3మిమీ, కులకచర్లలో 14.3మిమీ, బషీరాబాద్‌లో 13.5మిమీ, పెద్ద ఉమ్మెంతాల్‌లో 13.3మిమీ, దోమలో 12.5మిమీ వర్షపాతం నమోదైంది. బంట్వారంలో 10.8 మి.మీ., నవాబ్‌పేట్‌లో 10.8మిమీ, రాపోల్‌లో 10.3మిమీ, మన్నేగూడలో 9.8మిమీ, మోమిన్‌పేట్‌లో 8.3మిమీ., దుద్యాల్‌లో 5.5మిమీ, చౌడాపూర్‌లో 5.0మిమీ, దౌల్తాబాద్‌లో 4.0 మిమీ, మర్పల్లిలో 3.5మిమీ వర్షం కురిసింది.



వికారాబాద్ రైతు బజారు వద్ద ..



తాండూరులో ఇళ్లలోకి నీరు



ధారూరులో కురుస్తున్న వర్షం

రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి

యాచారం, జూన్ 30 : రైతుల ఆర్థికాభివృద్ధితో పాటు వారిని అన్నివిధాలా ఆదుకునేందుకే ప్రభుత్వం కృషి చేస్తుందని, రైతు భరోసా పథకం వర్తింపుపై రైతుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తుందని మేడ్చల్ జిల్లా సహకార శాఖాధికారి నాగాలింగాచారి తెలిపారు. రైతుల కడగండ్లు తీర్చడం కోసం ప్రభుత్వం రైతు భరోసా ద్వారా అందించే సాయంపై వివిధ విషయాలపై రైతుల అభిప్రాయాలను సేకరిస్తుందని, వారి సూచనలు, సలహాలు ప్రభుత్వానికి నివేదించనున్నట్లు ఆయన చెప్పారు. ఆదివారం యాచారం మండల కేంద్రంలో రైతు భరోసాపై రైతువేదిక భవన్‌లో ప్రజాప్రతినిధులు, రైతుల నుంచి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం రైతులనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఆర్థిక చేయూతనిందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వ రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందిస్తుందని తెలిపారు. కనీసం 9 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులకు రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించాలని యాచారం ఎంపీపీ కొప్పు సుకన్యబాషా అభిప్రాయం వ్యక్తం చేశార. గత ప్రభుత్వ కాలంలో రెండు మూడు ఎకరాలున్న రైతులకు కూడా రైతుబంధు, రైతుబీమా సాయమందలేదని, ధరణి పోర్టల్‌లోని లోపాలే ప్రధాన కారణమన్నారు. సమావేశంలో మండల సొసైటీ చైర్మన్ టి.రాజేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ కారింగ్‌యాదయ్య, జెడ్పీటీసీ చిన్నోళ్ల జంగమ్మ, మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్, సొసైటీ సభ్యులున్నారు.



మాట్లాడుతున్న నాగలింగాచారి

ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం

షాద్‌నగర్ అర్బన్, జూన్ 30: ఫరూఖ్‌నగర్ మండలంలోని చిల్కమర్రి గ్రామానికి చెందిన కుమ్మరి శ్రీశైలం ఇంటి నిర్మాణానికి.. అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు రవీందర్‌రెడ్డి రూ.20 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో రూ.20వేల చెక్కును ఆదివారం శ్రీశైలంనకు ఇప్పించారు. అనంతరం చిల్కమర్రి గ్రామంలో వివిధ కారణాలతో మరణించిన కుటుంబాలకు రవీందర్‌రెడ్డి ఆర్థిక సాయం చేశారు. చెనిగారి నర్సింగ్‌రావు కుటుంబానికి రూ.5వేలు, పెద్దసాయి రమేష్ కుటుంబానికి రూ.4వేలు, కె.శ్యామలమ్మ కుటుంబానికి నాలుగున్నర వేల రూపాయలు అందజేశారు. రవీందర్‌రెడ్డిని ఎమ్మెల్యే శంకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అభినందించారు.


చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే శంకర్, పక్కన రవీందర్‌రెడ్డి

వైభవంగా కట్టమైసమ్మ బోనాలు

మేడ్చల్ టౌన్, జూన్ 30: మేడ్చల్ పట్టణంలో కట్టమైసమ్మ బోనాల ఉత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. శనివారం సాయంత్రం నుంచి ప్రారంభించిన బోనాల ఉత్సవాల్లో పాల్గొనటానికి భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారికి బోనాలు సమర్పించారు. భక్తుల కోసం పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. మేడ్చల్ పట్టణానికి చెందిన వేముల శ్రీనివాస్‌రెడ్డి, మర్రి నర్సింహారెడ్డి, బాలమల్లేష్, శ్రీనివాస్‌గౌడ్, మర్రి శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


కట్ట మైసమ్మ ఆలయంలో గ్రామస్తుల పూజలు

పశుబలిపై పుకార్లు

కట్టమైసమ్మ బోనాల సందర్భంగా నిర్వహించిన ఉత్సవాల్లో భాగంగా దున్నపోతును బలి ఇవ్వడం ఆనవాయితీగా వస్తున్నందున ఈసారి కూడా పశువును బలి ఇస్తున్నట్లు పుకార్లు రావటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. అమ్మవారి బోనాల సందర్భంగా వారం రోజుల కిందట ఒక దున్నపోతును ఉరులో వదిలారని ఆ పశువును బోనాల సందర్భంగా బలి ఇస్తున్నారని స్థానికంగా పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. దీంతో స్థానిక పోలీసులు అప్రమత్తమయ్యారు. ఉత్సవ వేడుకలు నిర్వహించే వారితో మాట్లాడి పూర్తి వివరాలు సేకరించి పశుబలి ఇవ్వటం లేదన్న విషయాన్ని నిర్ధారించుకుని ఆలయం వద్ద బందోబస్తును ఏర్పాటు చేశారు. పశుబలి ఇస్తున్న విషయంలో వాస్తవం లేదని, కేవలం కొందరు అసత్య ప్రచారం చేశారని మేడ్చల్ సీఐ సత్యనారాయణ స్పష్టం చేశారు.

కాలనీల్లో సౌకర్యాల కల్పనకు చర్యలు

● మార్నింగ్ వాక్‌లో పోచారం మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి


మార్నింగ్ వాక్‌లో స్థానికులతో చర్చిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్, జూన్ 30: కాలనీల్లో సౌకర్యాల కల్పనకు చర్యలు చేపడతామని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం మార్నింగ్ వాక్‌లో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని ఇస్మాయిల్ ఖాన్‌గూడలో వివిధ కాలనీల్లో ఆదివారం స్థానికులతో కలిసి పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా నవదుర్గ కాలనీ ఫేస్-1లో గల పార్కును అభివృద్ధి చేయాలని కాలనీ వాసులతోపాటు కౌన్సిలర్ గొంగళ్ల మహేష్ కోరిక మేరకు తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. పార్కులో మొక్కలు నాటించడంతోపాటు వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. కాలనీల్లో డఅసోసియేషన్ల నిర్వాహకులు, యువజనసంఘాల సభ్యులు పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రధానంగా చెత్తను వీధుల్లో వేయకుండా తడి, పొడి చెత్తను వేరుచేసి మున్సిపాలిటీ వాహనాలలోనే వేయాలన్నారు. రోడ్ల పక్కన, వీదుల్లో చెత్త పడవేయడం వలన పరిసరాలు కలుషితమై ప్రజలు అనారోగ్యాల భారిన పడేప్రమాదమున్నందున ప్రతీఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు శ్రీకాంత్, గంగాధర్, భాస్కర్, రఘుపతి, ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతర అభ్యాసాన్ని అలవర్చుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 30: విద్యార్థులు నిరంతర అభ్యాసాన్ని అలవర్చుకోవాలని ఏడీఎం కార్పొరేట్ సంస్థ వైస్‌ప్రెసిడెంట్ సంజయ్ చురివాల అన్నారు. మండలంలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో 1వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా సంజయ్ చురివాల మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో నైపుణ్యాలను సృష్టించాలన్నారు. అనంతరం జనగాం ఎమ్మెల్యే, అనురాగ్ యూనివర్సిటీ చైర్మన్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదిగిన తరువాత సమాజ శ్రేయస్సుకోసం కృషిచేయాలన్నారు. నూతన అవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. అనురాగ్ యూనివర్సిటీలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు గుర్తుచేశారు. మొట్టమొదటి వార్షికోత్సవంలో 1600మంది విద్యార్థులు గ్రాడ్యుయేట్లకు సర్టిఫికెట్లు అందజేయగా టాపర్లకు నగదు బహుమతి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అనురాగ్ యూనివర్సిటీ సీఈవో సూర్యదేవర నీలిమ, వైస్ చాన్సలర్ డాక్టర్ అర్చన, రిజిస్ట్రార్ బాలాజీ ఊట్ల, డీన్లు డైరెక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఏడీఎం కార్పొరేట్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ సంజయ్ చురివాల, జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

కుర్మిద్ద పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడిగా మహేందర్‌రెడ్డి


మహేందర్‌రెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న కిషన్‌రెడ్డి

యాచారం, జూన్ 30 : మండలంలోని కుర్మిద్ద పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం అధ్యక్షుడిగా బందె మహేందర్‌రెడ్డి ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 250 మంది సభ్యులున్న సొసైటీలో మహేందర్‌రెడ్డి వరుసగా పదోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రైతులకు అందించే పథకాలను ప్రతీ రైతుకందేలా కృషి చేస్తానని ఆయన అన్నారు. ఇప్పటివరకు కుర్మిద్ద సొసైటీకి రూ.7లక్షల లాభం వచ్చిందన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

'గిరి వికాసం'తో బీడు భూముల్లో సాగు


మాట్లాడుతున్న మాధురి

ఆమనగల్లు, జూన్ 30: గిరి వికాసం పథకం కింద గిరిజనుల బీడు భూములను సాగులోకి తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎంపీడీవో కుసుమ మాధురి తెలిపారు. సన్న, చిన్నకారు రైతులకు ఈ పథకం ద్వారా బోరు, విద్యుత్, మోటార్ ఉచితంగా అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయంలో గిరి వికాసం పథకం గురించి కుసుమ మాధురి వివరించారు. గిరిజన రైతులను ఆదుకొని.. వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన గిరి వికాస పథకానికి అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈజీఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులను పథకం వివరాల కోసం సంప్రదించాలని, మండలంలో మేడిగడ్డ, రాంనుంతల గేటు తండాలను మొదటి విడత పథకం కింద ఎంపిక చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఐదెకరాలలోపు భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులకు ఈ పథకం ద్వారా లబ్ధి కలుగుతుందని కుసుమ మాధురి వివరించారు. గిరి వికాసం పథకం ద్వారా లోగడ గిరిజన రైతులకు ఇచ్చిన వ్యవసాయ భూముల్లో బోర్లు వేసి వాటిని సాగుకు యోగ్యంగా మార్చాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. డీఆర్‌డీఏ ద్వారా ఈ పథకం అమలు చేయడం జరుగుతుందని కుసుమ మాధురి తెలిపారు.



ప్రమాదభరితంగా మూలమలుపు

ఆమనగల్లు, జూన్ 30: ఆమనగల్లు-మాడ్గుల రోడ్డులో జంగారెడ్డి పల్లి వద్ద మూల మలుపు ప్రమాదభరితంగా మారింది. చెరువు వద్ద ఏమాత్రం ఆదమరిచినా ప్రాణాలకే ప్రమాదం. ఇటీవల డబుల్ రోడ్డుగా విస్తరించినా.. మూల మలుపు వద్ద ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. రోడ్డులో రెండు మూడు చోట్ల మూల మలుపులు ఉండడం వల్ల కొన్నిసార్లు ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. దాంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మూడేళ్ళ క్రితం జరిగిన ప్రమాదంలో ఓ ఏఎస్సై ఈ మూల మలుపు వద్దే చనిపోయాడు. ఒక వైపు చెరువు, మరో వైపు గుట్ట ఉండడం వల్ల రోడ్డు ప్రమాదకరంగా మారింది. రాళ్ళను తొలగించి రోడ్డును నేరుగా చేసి సూచిక బోర్డులు ఏర్పాటుచేయాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.



మైసమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దశరథ్ నాయక్

సన్మార్గంతోనే దైవానుగ్రహం

కడ్తాల్, జూన్ 30: మానవాళి సన్మార్గ పురోగమనానికి, సమాజ శాంతి స్థాపనకు దైవ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతాయని జడ్పీటీసీ దశరథ్ నాయక్ అన్నారు. ఆధ్యాత్మిక చింతనతో ముందుకు సాగేవారు ఆనందమయ జీవితాన్ని పొందుతారని పేర్కొన్నారు. కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని ఆదివారం జడ్పీటీసీ దశరథ్‌నాయక్ కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మర్యాదలతో దశరథ్ నాయక్‌ను సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవ కార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరు పాలు పంచుకోవాలని కోరారు. మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని మరింత తీర్చిదిద్ది భక్తులకు తగిన వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. సన్మార్గంతోనే దైవానుగ్రహం లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గోపాలకృష్ణ, శారద, బీక్యనాయక్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎస్సై రవీందర్

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

- మహేశ్వరం ఎస్సై రవీందర్

మహేశ్వరం, జూన్ 30 : విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండడంతో పాటు చదువులో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని మహేశ్వరం ఎస్సై రవీందర్ సూచించారు. మాస్టర్‌మైండ్స్ విద్యాసంస్థ ఆధ్వర్యంలో మహేశ్వరంలో నిర్వహించిన కంప్యూటర్ శిక్షణలో భాగంగా కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు ఆదివారం ఉత్తీర్ణత పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై హాజరై మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను ఎంతో కష్టపడి చదివిస్తారని తెలిపారు. ప్రతీ ఒక్కరు ఉన్నత విద్యపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యాదీష్, దేవేందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాలలను ప్రారంభించాలి

కులకచర్ల, జూన్ 30: మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాలను ప్రారంభించాలని బాలికల తల్లిదండ్రులు కోరుతున్నారు. కొత్త మండలం చౌడాపూర్‌కు 2022లో కేజీబీవీ పాఠశాల మంజూరైంది. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో అనువైన భవనం అద్దెకు లభించకపోవడంతో అధికారులు కేజీబీవీని ప్రారంభించడం లేదు. దీంతో ఈ విద్యాసంవత్సరం కులకచర్ల కేజీబీవీలో 6, 7 తరగతులు నిర్వహించాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. ఈక్రమంలో కులకచర్ల కేజీబీవీ ప్రిన్సిపాల్ విశ్వదేవి 6, 7తరగతులకు సంబంధించి బాలికల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కానీ విద్యాసంవత్సరం ప్రారంభమై 20రోజులు గడుస్తున్నా తరగతులు ప్రారంభించలేదు. దీంతో బాలికల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎంఈవో హబీబ్ అహ్మద్‌ను వివరణ కోరగా దరఖాస్తులు తీసుకున్న విషయం తనకు తెలియదని ఎంఈవో హబీబ్ అహ్మద్ చెప్పడం గమనార్హం.

న్యాయవాద పరిషత్ జిల్లా అధ్యక్షుడిగా కృష్ణారెడ్డి



కృష్ణారెడ్డి

పరిగి, జూన్ 30: న్యాయవాది పరిషత్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా పరిగికి చెందిన జి.కృష్ణారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఆనంద్‌గౌడ్, నర్సింహ్మారావు, జింకల యాదయ్య తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన కార్యవర్గాన్ని సహచర న్యాయవాదులు సన్మానించారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు కృషిచేస్తానని తెలిపారు. సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానని చెప్పారు. కొత్తగా ఎన్నికైన కృష్ణారెడ్డి ఏజీపీ బి.వెంకట్‌రెడ్డి, యాదవ్‌రెడ్డి తదితరులు ఘనంగా సన్మానించారు.

విజయవంతమైన కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తాల్మిక్ వైద్యులు

కొడంగల్ రూరల్, జూన్ 30: శ్రీసత్యసాయి భజన మండలి శంకర కంటి ఆసుపత్రి సంయుక్తాధ్వర్యంలో ఆదివారం కొడంగల్‌లోని అక్షర పాఠశాలలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. కంటి వైద్యులు బాల్‌రాజ్, విజయ్‌కుమార్‌లు శిబిరానికి వచ్చిన ప్రజలకు పరీక్షలు నిర్వహించారు. మొత్తం 125మందికి పరీక్షలు నిర్వహించగా అందులో 35మందికి కంటిలో శుక్లాలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. వీరిని ఆపరేషన్ల కోసం హైదరాబాద్‌కు రెఫర్ చేసినట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, శ్రీసత్యసాయి భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

భవిష్యత్ నిర్మాణంలో గ్రంథాలయాలది కీలక భూమిక

- పాఠకులు, నిరుద్యోగుల మనసు చూరగొన్న ఉపగ్రంథ పాలకుడు కిషన్‌గౌడ్
- ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పౌరగ్రంథాలయాల శాఖ రాష్ట్ర డైరెక్టర్ ఏవీఎన్ రాజు



కిషన్ దంపతులను సన్మానిస్తున్న ఏవీఎన్ రాజు, సురేష్

వికారాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): చదువు నేర్చుకోవడంలో విద్యాసంస్థలు ఎంతటి పాత్ర పోషిస్తాయో ఉజ్వల భవిష్యత్తు నిర్మాణం చేసుకోవడంలో గ్రంథాలయాలు అంతే కీలక భూమిక పోషిస్తాయని పౌర గ్రంథాలయాల శాఖ రాష్ట్ర డైరెక్టర్ ఏవీఎన్ రాజు అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కేంద్ర కార్యాలయంలో ఆదివారం కార్యదర్శి పి.సురేష్‌బాబు అధ్యక్షతన జరిగిన గ్రేడ్-1 ఉప గ్రంథ పాలకుడు కె.కిషన్‌గౌడ్ ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తన 36ఏళ్ల సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో కిషన్ విధి నిర్వహణలో క్రమశిక్షణ, సమయపాలన, కలుపుగోలుతనంతో వ్యవహరించి ఎంతోమంది విద్యార్థులు, పాఠకుల మనస్సు దోచుకున్నారన్నారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉంటూ తన కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తించారని కొనియాడారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు, అభ్యర్థులు కోరిన పుస్తకాలను తెప్పింపడానికి కిషన్ ప్రత్యేకంగా చొరవ తీసుకున్నారని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ అనేది తప్పదని, ప్రతీ ఉద్యోగి ఉద్యోగ విరమణ చేయాల్సిందేనన్నారు. విధి నిర్వహణలో మనం వ్యవహరించే తీరే మనకు పేరు తీసుకువస్తుందని చెప్పారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులు గ్రంథాలయాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని, సెలవురోజుల్లో కూడా సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. గ్రంథాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఉద్యోగ విరమణ చేసిన కిషన్ సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని, భావితరాల జీవితం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ చేసిన కిషన్, రాధ దంపతులను పౌర గ్రంథాలయ శాఖ రాష్ట్ర డైరెక్టర్ ఏవీఎన్ రాజు, సంస్థ జిల్లా కార్యదర్శి సురేష్‌బాబు, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల కార్యదర్శి మనోజ్‌కుమార్, నిజామాబాద్ జిల్లా కార్యదర్శి బుగ్గారెడ్డి, టీడీఎల్ ఎడ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎల్.కిషన్, ప్రభుత్వ డైట్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ బందెప్పగౌడ్, దిలీప్‌సింగ్, నర్సింహారెడ్డి, శివప్ప, భీంరాజ్, సంస్థ సిబ్బంది లక్ష్మప్ప, రమేష్, ముంజాత్, స్రవంతి తదితరులు శాలువాలు, పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు.

రైతులకు మరింత చేరువగా రైతునేస్తం

- బషీరాబాద్ రైతువేదికకు వీడియో కాన్ఫరెన్స్ యూనిట్ మంజూరు
- ఇకపై అత్యాధునిక సాంకేతిక వ్యవస్థతో అన్నదాతలకు సలహాలు



బషీరాబాద్(నవాంద్గీ) రైతు వేదికకు చేరిన వీడియో కాన్ఫరెన్స్ యూనిట్ పరికరాలు



నవాంద్గీ క్లస్టర్ రైతువేదిక

బషీరాబాద్, జూన్ 30: రైతు వేదికలో ప్రతీ మంగళవారం నిర్వహిస్తున్న 'రైతునేస్తం' కార్యక్రమాన్ని విస్తృత పర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. మండలానికి ఒకటి చొప్పున రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్‌లను మంజూరు చేసింది. ఈ క్రమంలో మొదటి విడతగా బషీరాబాద్‌లోని (నవాంద్గీ) రైతువేదికలో రైతునేస్తం కార్యక్రమాన్ని చేపట్టేందుకు వీడియో కాన్ఫరెన్స్ యూనిట్ పరికరాలను సరఫరా చేసింది. అప్పట్లో ప్రయోగాత్మకంగా తొలుత ప్రతీ నియోజకవర్గంలో ఓ రైతు వేదికకు మాత్రమే వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం కల్పించి అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేవారు. దీంతో రైతులకు మరింత చేరువగా రైతునేస్తం కార్యక్రమాన్ని ప్రభుత్వం తీసుకువచ్చింది. దీంతో ఒక్కో రైతువేదికకు వీడియో కాన్ఫరెన్స్ యూనిట్ ఏర్పాటుకు రూ.3.70లక్షలను ప్రభుత్వం ఖర్చు చేసింది. వచ్చే నెల మొదటివారంలోగా రైతునేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు వ్యవసాయాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సలహాలు, సూచనలు పొందొవచ్చు

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రైతుభరోసా, పంటల సాగు, రుణాలకు సంబంధించిన ఎలాంటి సందేహాలు ఉన్నా త్వరగా పరిష్కారమయ్యేందుకు శాస్త్రవేత్తలు, సంబధిత అధికారులు రైతులకు వివరిస్తారు. ఆయా పంటల సాగుకు, చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలపై నిపుణులు అవగాహన కల్పిస్తారు. అదేవిధంగా రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు ఎంత మోతాదులో వేయాలనే దానిపై సంబంధిత అధికారులు సూచనలిస్తారు.

రైతులకు ఎంతో మేలు



ప్రస్తుతం రైతు వేదికలో ఏర్పాటు చేస్తున్న ఆధునిక సాంకేతిక వ్యవస్థ ద్వారా రైతులకు ఎంతో మేలు చేకూరనుందని బషీరాబాద్ వ్యవసాయాధికారి సూర్యప్రకాష్ తెలిపారు. రైతులు ఎప్పటికప్పుడు ప్రతీ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్‌లో పంటసాగులో మెలకువల గురించి తెలుసుకునే అవకాశముంటుందన్నారు. తద్వారా వ్యవసాయంతో పాటు ఉద్యాన, పట్టు, మత్స్య, పశుసంవర్ధక, విద్యుత్, నీటిపారుదల శాఖలకు సంబంధించిన సమాచారం తెలుసుకునే వీలుంటుంది. త్వరలో ఈ సౌకర్యం రైతులకు అందుబాటులోకి రానుంది.

సూర్యప్రకాష్, వ్యవసాయాధికారి, బషీరాబాద్ మండలం

'ప్రజావాణి'లో మార్పులు

- ఇకపై డివిజన్ కేంద్రంలో ఫిర్యాదుల స్వీకరణ
- నేడు తాండూరు ఆర్డీవో కార్యాలయంలో ప్రజావాణి
- డివిజన్ స్థాయి అధికారుల హాజరు తప్పనిసరి

తాండూరు, జూన్ 30: ఆర్నెళ్లుగా నిలిచిపోయిన ప్రజావాణి కార్యక్రమం కొత్త మార్పులతో మళ్లీ ప్రారంభమవుతోంది. గతానికి భిన్నంగా ప్రస్తుతం ఈ కార్యక్రమం కొనసాగనుంది. మండల, డివిజన్ మున్సిపాలిటీ స్థాయిలో ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరించనున్నారు. ఇప్పటికే 'ప్రజావాణి' కార్య క్రమాన్ని నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు అందాయి. ప్రతీ సోమవారం జిల్లాస్థాయిలో నిర్వహించడంతో పాటు ఇక మీదట మండల, డివిజన్ మున్సిపల్ స్థాయిలో నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీఅయ్యాయి. గతంలో మండల, జిల్లా, మున్సిపల్ స్థాయిలో నిర్వహించినప్పటికీ నామామాత్రంగా నిర్వహించారు. సోమవారం (జూలై1) నుంచి నిర్వహించే 'ప్రజావాణి'ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. తాండూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయ ప్రజావాణి ఉండేది కాదు. ప్రస్తుతం సోమవారం నుంచి డివిజన్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించాలని డీఎల్‌పీవో, వ్యవసాయ శాఖ ఏడీ, ట్రాన్స్‌కో, ఆర్టీసీ, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ శాఖ ఈఈ, డీఈఈ, సీడీపీవో శాఖల డివిజన్‌స్థాయి అధికారులందరూ హాజరుకావాలని ఆదేశించారు. ఎంఎస్ఏవో, మండల స్థాయి అధికారులతో ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దార్ ప్రజావాణి నిర్వహించాలని పేర్కొన్నారు. గతంలో తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించేవారు. తాజాగా ప్రభుత్వం మున్సిపాలిటీస్థాయిలో సంబంధిత శాఖల అధికారులతో కలిసి మున్సిపల్ స్థాయిలో నిర్వహించాలని ఆర్డర్‌లో పేర్కొంది.

సీపీఎం బలోపేతానికి పాటుపడాలి

- పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాములు



తమ్మలోనిగూడలో యాచారం మండల సీపీఎం కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రాములు

యాచారం, జూన్ 30 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటాలు చేస్తూ పార్టీని నిర్మాణాత్మకంగా బలోపేతం చేయడానికి ప్రతీ కార్యకర్త పాటుపడాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు రాములు పిలుపునిచ్చారు. ఆదివారం మండల స్థాయి రాజకీయ రాజకీయ శిక్షణా శిబిరం తమ్మలోనిగూడలో నిర్వహించగా.. రాములు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇకపై బూత్‌లవారీగా సమావేశాలు ఏర్పాటుచేసి పార్టీ బలోపేతం చేయడంపై కార్యాచరణ రూపొందించి ముందుకు సాగాలన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేరుతాయనే విశ్వాసం ప్రజలకు లేదన్నారు. రూ.500లకే వంట గ్యాస్ అందడం లేదని విమర్శించారు. మహిళలకు బస్సుల్లో ఉచిత రవాణా వసతి ఉన్నా.. సరిపడా బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మరో నాలుగు రోజులుపోతే ఎంపీటీసీల కాల పరిమితి ముగుస్తుందని, జనం గోడు తీర్చేదెవరో తెలియని దుస్థితి నెలకొందని అన్నారు. రాష్ట్రంలో చాలాచోట్ల పంచాయతీలలో నిధులు లేక.. కనీసం పంచాయతీ సిబ్బందికి వేతనాలు ఇవ్వడం లేదని చెప్పారు. ధరణి పోర్టల్ కారణంగా గత ప్రభుత్వ కాలం నుంచి నేటికీ పేద, మధ్యతరగతి రైతులకు రైతుబంధు సాయం అందడం లేదనే విషయం పాలకులు ఎందుకు గమనించడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా కింద కేవలం చిన్న, సన్నకారు రైతులకు మాత్రమే సాయం అందిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా అర్హులకు రేషన్‌కార్డులు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని జిల్లా రైతు సంఘం కార్యదర్శి బి.మధుసూదన్‌రెడ్డి. సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహలు విమర్శించారు. ఇళ్లు లేని పేదలందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. శిథిలావస్థకు చేరిన పాఠశాలల గదులను కూల్చి.. కొత్తగా గదులు నిర్మించాలని కోరారు. సమావేశంలో సీపీఎం నాయకులు పగడాల యాదయ్య. పి.అంజయ్య. పి.వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇక సర్కారు వారి 'మీ సేవ'లు

- మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహణ
- ఇంటర్మీడియట్ విద్యార్హత
- వార్డు, గ్రామ స్థాయిలో ఏర్పాటు
- శిక్షణానంతరం ఆగస్టు 15 తర్వాత ఏర్పాటు



తాండూరు, జూన్ 30: మహిళా సంఘాలకు సర్కారు మరో అధికారాన్ని అప్పగించనుంది. పల్లె, పట్టణాల్లో మీసేవా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. మెప్మా, ఐకేపీల ఆధ్వర్యంలో ఈ కేంద్రాలు కొనసాగనున్నాయి. ఆగస్టు 15 తర్వాత ఈ కేంద్రాలు తెరుచుకోనున్నాయి. మహిళా సంఘాల్లో ఉన్న మహిళా సభ్యులకు ఇంటర్మీడియట్ విద్యార్హతతో ఈ నియమాకాలుంటాయని అధికారులు పేర్కొంటున్నారు. మండలంలో గ్రామం యూనిట్‌గా మున్సిపాలిటీల్లో వార్డు యూనిట్‌గా ఈ మీసేవా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రతీ గ్రామంలో ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మహిళాశక్తి పథకం కింద స్వయం సహాయక సంఘాల సభ్యులకు అప్పగిస్తారు. ఈ కేంద్రాల ద్వారా పలు రకాల ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్‌సేవలు, దరఖాస్తులు, చెల్లింపులు సహా 150పైగా ప్రభుత్వ సేవలు, 600కు పైగా ప్రైవేట్ సేవలకు గ్రామీణ ప్రాంతాలకు తమ గ్రామంలోనే చేసుకోవచ్చు. సమయం ఆదాతో పాటు ఆర్థికంగా గ్రామీణులకు కలిసివస్తుంది. విలేజ్ ఆర్గనైజేషన్ పేరిట మహిళా శక్తి మీసేవా కేంద్రాలను ప్రభుత్వం మంజూరు చేస్తోంది. స్త్రీనిధి ద్వారా మీసేవా కేంద్రం ఏర్పాటుకు రూ.2.50లక్షల రుణాన్ని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంజూరు చేస్తుంది. ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణలో గుర్తింపు పొందని సంస్థల నుంచి కంప్యూటర్లు, ప్రింటర్లు, జీపీఎస్, బయోమెట్రిక్, సామగ్రి, కెమెరా, ఇంటర్నెట్ కనెక్షన్ కొనుగోలు చేయాల్సి ఉంటుంది. గ్రామ పంచాయతీ ప్రభుత్వ స్కూల్స్, రైతువేదిక, అంగన్‌వాడీ అందుబాటులో ఉన్న ప్రభుత్వ భవనాల్లో ఈకేంద్రాలను ఏర్పాటు చేస్తారు. కేంద్రం నిర్వహణ, సేవలపై వారికి శిక్షణ ఇస్తారు. ఎంపికైన సంఘాలతో మీసేవా సంస్థ అవగాహన ఒప్పందం కుదుర్చుకోనుంది. ప్రభుత్వం నిర్ధేశించిన ధరల మేరకు పారదర్శకంగా సేవలను అందిస్తారు. మీసేవా కేంద్రాల నిర్వహణకు నియమించిన అధికారుల పర్యవేక్షణలో ఈ కేంద్రాలుంటాయి.

ఎస్‌జీటీ ఖాళీలన్నీ బదిలీల్లో చూపించాలి

- టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకట్ రత్నం

వికారాబాద్, జూన్ 30: ఎస్‌జీటీ తత్సమాన కేటగిరీ ఉపాధ్యాయులు బదిలీలకు వేలాది పోస్టులకు బ్లాక్‌చేసి అప్రకటిత రేషనలైజేషన్ చేయడాన్ని టీఎస్ యూటీఎఫ్ వికారాబాద్ జిల్లా తీవ్రంగా ఖడిస్తుందని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరత్నం, పవన్ కుమార్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం రేషనలైజేషన్ పై విధాన పరమైన నిర్ణయం తీసుకోకుండా విద్యార్థుల సంఖ్యను అనుసరించి అదనపు పోస్టులను బ్లాక్ చేసిన విద్యాశాఖ అవసరమైన పాఠశాలలకు అదనపు పోస్టులను మాత్రం కేటాయించడం లేదన్నారు. బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ లోని లేని హేతుబద్ధీకరణ యస్జీటీ బదిలీల మధ్యలో చూపించి కేవలం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో మాత్రమే అమలు చేయడం తగదన్నారు. కోర్టు కేసులను బూచిగా చూపి వేల సంఖ్యలో ఉండే ఎస్జీటీలకు ఆప్షన్ గడువును ఒక్కరోజే ఇచ్చి హడావుడిగా ముగించాలని చూడడం సమంజసం కాదన్నారు. సినియారిటీ జాబితాల్లో తప్పులు సవరించడకుండా ఖాళీలను పూర్తి స్థాయిలో చూపించకుండా జరిపే బదిలీలను నిలిపి వేయాలని, విద్యాశాఖ అసమర్థత అసమగ్ర విధానాలు బదిలీలు, పదోన్నతులు ప్రక్రియ ఏడాదిన్నరగా సాగతీతకు కారణమైందన్నారు. వేల మంది ఉపాధ్యాయులకు వెబ్ కౌన్సిలింగ్ సక్రమంగా నిర్వహించలేక పోవడం ఏమిటని ప్రశ్నించారు. అసరమైతే ప్రక్రియను రెండు రోజులు వాయిదా వేసి సమస్యలన్నీ సానుకూలంగా పరిష్కరించి, పొరపాట్లను సవరించి పారదర్శకంగా వెబ్ కౌన్సిలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

బొంరాస్‌పేట్: ఎస్‌జీటీ తత్సమాన కేటగిరీ ఉపాధ్యాయుల బదిలీలకు వేలాది పోస్టులను బ్లాక్ చేసి అప్రకటిత రేషనలైజేషన్ చేయడాన్ని యూటీఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు గౌరారం గోపాల్, నరేందర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో ఖండించారు. రేషనలైజేషన్‌పై విధానపరమైన నిర్ణయం తీసుకోకుండా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు పోస్టులను బ్లాక్ చేసిన విద్యాశాఖ అవసరమైన పాఠశాలలకు అదనపు పోస్టులను మాత్రం కేటాయించడం లేదని ఆరోపించారు. బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌లో లేని హేతుబద్ధీకరణను మధ్యలో చొప్పించి కేవలం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో మాత్రమే అమలు చేయడం గందరగోళానికి గురిచేస్తోందన్నారు. కోర్టు కేసులను బూచిగా చూపి వేల సంఖ్యలో ఉండే ఎస్‌జీటీలకు ఆప్షన్ గడువును ఒక్కరోజే ఇచ్చి హడావుడిగా ముగించాలని చూడటం సరైంది కాదన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మోమిన్‌పేట్, జూన్ 30: మోమిన్‌పేట్, మర్పల్లి మండలాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 33 కేవీ సదాశివపేట్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిర్వహణ లేక.. శిథిలావస్థలో ట్యాంకు

బొంరాస్‌పేట్, జూన్ 30: దశాబ్దాల కిందట నిర్మించిన ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకు శిథిలావస్థకు చేరుకుంది. నిర్వహణ లోపం కారణంగా పిచ్చిమొక్కలు పెరిగి వాటి వేర్లు ట్యాంకుల్లోకి వెళ్లి పగుళ్లు చూపాయి. పంచాయతీలో ప్రత్యేకాధికారుల పాలనలో పట్టింపు కరువైంది. మండల కేంద్రంలోని ఐబీ అతిథి గృహం వెనుక నిర్మించిన ట్యాంకులపై మర్రి మొక్కలు మొలిచాయి. వాటి వేర్లు ట్యాంకు పైభాగంలో చుట్టూ ఆక్రమించాయి. వాటితో పగుళ్లు ఏర్పడి శిథిలావస్థకు చేరాయి. దీంతో పాటు ట్యాంకులో పక్షులు పడినా చూసే దిక్కులేదు. ఈ విషయంపై ఇప్పటికే పంచాయతీ కార్యదర్శికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా వాటిని తొలగించడం లేదని నీటిట్యాంకు పక్కనే నివాసముంటున్న ఎండీ. మొహ్మద్ తెలిపాడు. ఎప్పటికప్పుడు ట్యాంకులపై పిచ్చి మొక్కలను తొలగిస్తూ పరిశుభ్రంగా ఉంచితే బాగుంటుందని తెలిపారు. ఇప్పటికే గ్రామానికి చివరన ఉన్న మాలగుట్టపై నిర్మించిన మరో ఓహెచ్‌ఎస్‌ఆర్ సైతం లీకేజీలతో శిథిలావస్థకు చేరుకుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



బొంరాస్‌పేట్‌లో ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకుపై మొలిచిన పిచ్చి మొక్కలు

సాగుభూమికే రైతుభరోసా ఇవ్వాలి

- నవాంద్గీ సొసైటీ ఆధ్వర్యంలో ప్రజాఅభిప్రాయ సేకరణ
- పాల్గొన్న జిల్లా వ్యవసాయాధికారి గోపాల్


బషీరాబాద్: రైతుభరోసా ప్రజాభిప్రాయ సేకరణలో మట్లాడుతున్న సొసైటీ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి


యాలాల: సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి

బషీరాబాద్, జూన్ 30: సాగుభూమికే రైతు భరోసా పథకం అమలుచేయాలని రైతులు పలువురు అధికారులకు సూచించారు. నవాంద్గీ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక రైతువేదిక భవనంలో ఆదివారం రైతుభరోసా పథకం అమలుపై రైతులతో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి గోపాల్, సొసైటీ చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి, వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్ నేతృత్వంలో అక్కడికి వచ్చిన పలువురు రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. మెజార్టీ రైతులు బీడు భూములకు కాకుండా సాగుచేస్తున్న రైతులకు ఎంత భూమి ఉంటే అంతా రైతుభరోసా ఇవ్వాలన్నారు. సకాలంలో రైతు భరోసా ఇస్తే పంటల సాగుకు ఉపయోగపడుతుందనే అభిప్రాయాన్ని రైతులు వ్యక్తంచేశారు. రైతులతో వ్యవసాయాధికారులు పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చిస్తూ రైతుభరోసా అమలుకు సలహాలు, సూచనలు అడిగి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా గోపాల్ మట్లాడుతూ.. రైతుల నుంచి సేకరించిన అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అనంతరం వ్యవసాయాధికారి గోపాల్‌కు సొసైటీ తరఫున చైర్మన్, పాలకవర్గం సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మిర్యాణం శ్రీనివాస్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల నాయకులు శంకర్‌రెడ్డి, డైరెక్టర్లు బాస్పల్లి శ్రీనివాస్‌రెడ్డి, అశోక్‌గౌతం, నారా గోపాల్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, గోపాల్, బషీరాబాద్ ఏవో సూర్యప్రకాష్, సీఈవో బందెయ్య, పారుఖ్ పాల్గొన్నారు.

నేడు ధారూరు, మోమిన్‌పేట్‌లో ప్రజాభిప్రాయసేకరణ

ధారూరు: ధారూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నేడు(సోమవారం) రైతు భరోసా పై రైతుల అభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహిస్తున్నట్లు సంఘం చైర్మెన్ వై.సత్యనారాయణ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ధారూరు రైతు వేదికలో మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో రైతు భరోసా పథకం పై రైతు అభిప్రాయాలను సేకరిస్తామని ఆయన చెప్పారు. మండలంలోని రైతులంతా ఈ సమావేశానికి హాజరై తమ అభిప్రాయాలను తెలియజేయాలని ఆయన కోరారు.

మోమిన్‌పేట్: రైతుభరోసా అభిప్రాయ సేకరణకు మండలంలోని మేకవనంపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో రైతుల నుంచి అభిప్రాయ సేకరణ సమావేశాన్ని ఈనెల 3వ తేదీన మధ్యాహ్నం 2గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు పీఏసీఎస్ డైరెక్టర్ పట్లోళ్ల అంజిరెడ్డి, సీఈవో బాలకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశంలో రైతుల నుంచి సలహాలు, సూచనలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, సహకర సంఘం అధికారి ఈశ్వరయ్య తదితరులు హాజరు కానున్నట్లు తెలిపారు.

కులకచర్ల: పంటలు సాగు చేసే రైతులకు రైతు భరోసా పథకం వర్తింపజేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు రైతులు విన్నవించారు. ఆదివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు మొగులయ్య, డీసీవో ఈశ్వరయ్య ఆధ్వర్యంలో రైతు భరోసాపై ప్రజాభిప్రాయ సేకరణ సభ నిర్వహించారు. రైతుల నుంచి సలహాలు, సూచనలు తెలుసుకున్నారు. కనీసం 10 ఎకరాల వరకు రైతులకు పెట్టుబడి సహాయం అందించాలని కోరారు. అంతే కాకుండా ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఎరువుల ధరలు కూడా తగ్గించాలని కోరారు. ప్రజల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామని డీసీవో ఈశ్వరయ్య మాట్లాడుతూ తెలిపారు. ఈ సందర్భంగా డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, సొసైటీ వైస్‌చైర్మన్ నాగరాజు, సీఈవో బక్కారెడ్డిలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ఎంపీటీసీ ఆనంద్, సొసైటీ డైరెక్టర్లు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.


కులకచర్ల: మాట్లాడుతున్న డీసీవో ఈశ్వరయ్య

కౌలురైతులకు రైతు భరోసా వర్తింపజేయాలి

బొంరాస్‌పేట్: కౌలు రైతులకు రైతు భరోసా వర్తింపజేయాలని రైతులు అధికారులను కోరారు. ప్రభుత్వం రైతు భరోసా కోసం చేపట్టిన సలహాలు, సూచనల కార్యక్రమంలో భాగంగా బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని రైతు సహకార సంఘం ఆవరణలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు. పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రైతు భరోసా కోసం రైతులు తమ అభిప్రాయాలు తెలిపారు. రైతుల సూచన మేరకు రైతు భరోసాలో చర్యలు చేపట్టనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కృష్ణ, డైరెక్టర్‌లు, రైతులు, సిబ్బంది రమేశ్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

10ఎకరాల లోపు రైతులకు భరోసా ఇవ్వాలి

యాలాల: ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా పథకాన్ని 10ఎకరాల లోపు ఉన్న రైతులందరికీ వర్తింప జేయాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు భరోసా కార్యక్రమంపై ఆదివారం రైతుల అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా వ్యవసాయాధికారి గోపాల్, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు. పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు కొరుకునే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ మాట్లాడుతూ రైతులు పేర్కొన్న విధంగా పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి యాదగిరి, సిబ్బంది వేణు, మల్లేశం, వెంకటయ్య, రైతులు శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మప్ప, మల్కప్ప, కాసీం, అగ్గనూరు మాజీ సర్పంచ్ బీమప్ప, మాజీ ఉప సర్పంచ్ వెంకటయ్య, శ్రీనివాస్‌రెడ్డి, బస్వరాజులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్యే యాదయ్య


ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిని కలిసిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య

పరిగి/నవాబుపేట/పూడూరు, జూన్ 30: కాంగ్రెస్ పార్టీలో చేరిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ఆదివారం డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే టీ.రామ్మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మన్నెగూడ వ్యవసాయ క్షేత్రంలో రామ్మోహన్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. అనంతరం రాజకీయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

దోమ: ప్రతీఒక్కరు అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని పరిగి ఎమ్మెల్యే టీ.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని బ్రహ్మణపల్లి గ్రామంలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణలో ఆయన పాల్గొని మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాలకు న్యాయం చేకూర్చేందుకు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ చేసిన కృషి మరవలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో హరిశ్చంద్ర, కులకచర్ల పీఏసీఎస్ చైర్మన్ కె.మొగులయ్య, దళిత ప్రజా సంఘాల నాయకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

యువత విద్యలో రాణించాలి


ఘట్‌కేసర్‌లో అంబేడ్కర్ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ప్రబుద్ధ భారత్ సంస్థ ప్రతినిధులు

ఘట్‌కేసర్, జూన్ 30: యువత అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని విద్యలో రాణించాలని ఘట్‌కేసర్ మున్సిపాలిటీ వంజరి సంఘం అధ్యక్షుడు అముద బాల్‌రాజ్ అన్నారు. ప్రబుద్ధ భారత్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎదులాబాద్ రోడ్డులో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బాల్‌రాజ్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని ఉన్నత చదువులు చదవడం వల్లే దేశ రాజ్యాంగ రచనలో భాగస్వామి అయ్యాడన్నారు. ఈ కార్యక్రమంలో మీసాల అరుణ్‌కుమార్, కందకట్ల పద్మారెడ్డి, మేకల దాసు, కె.రామోజీ, శ్రీనివాస్, నర్సింగ్‌రావు, రాందాస్, రాజేష్, రవి, కిరణ్, సత్యం, జగదీష్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

కులకచర్ల, జూన్ 30: చాపలగూడెం గ్రామంలో పగిడాల బాలయ్య ముదిరాజ్ శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకుని గ్రామ మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బాధిత కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మత్స్య సహకార సంఘం డైరెక్టర్ మొగులయ్య, గండి సిద్దయ్య, గుంటి సాయప్ప, గండి భీమయ్య, చిట్టిల వెంకప్ప, బొల్ల కిష్టయ్య, మృతుడి కుటుంబ సభ్యులు బసప్ప, రాములు, నర్సింహులు, రాములు, మాజీ సర్పంచ్ గండి లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఫంక్షన్‌హాల్ ప్రారంభం


కొర్విచెడ్ వద్ద ఫంక్షన్‌హల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

బషీరాబాద్, జూన్ 30: మండలంలోని కొర్విచెడ్ గ్రామ సమీపంలో ప్రధానరోడ్డు పక్కన నూతనంగా నిర్మించిన ఓ ఫంక్షన్‌హాల్‌ను ఆదివారం ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మిర్యాణం శ్రీనివాస్‌రెడ్డి, నవాంద్గీ సొసైటీ చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి, వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు జి.మాధవరెడ్డి, పి.శంకర్‌రెడ్డి, పిసుధాకర్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, బాన్సిలాల్, వడ్డే హన్మంతు పాల్గొన్నారు.

రూపాదేవికి నేతల నివాళి


రూపాదేవికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు

శామీర్‌పేట, జూన్ 30: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సతీమణి మేడిపల్లి రూపాదేవి ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం శామీర్‌పేట మండలం అంతాయిపల్లిలోని ఎస్ఎస్ఆర్ పుష్పాకన్వెన్షన్ హాల్‌లో ఆమె భర్త ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో దశదిన కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దివంగత మేడిపల్లి రూపాదేవి చిత్రపటానికి మాజీ మంత్రి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే చల్ల వంశీధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, టీపీసీసీ అధికార ప్రతినిధి నేరెళ్ళ శారద, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్‌గౌడ్, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు విచ్చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

క్రీడాకారులు అత్యున్నత స్థాయికి ఎదగాలి


పోటీల్లో రన్నింగ్ చేస్తున్న కిడ్స్ క్రీడాకారులు

శామీర్‌పేట, జూన్ 30: క్రీడాకారులు అత్యున్నత స్థాయికి ఎదగాలని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజశేఖర్ అన్నారు. తూంకుంటలోని రాష్ట్ర క్రీడా పాఠశాల గ్రౌండ్స్‌లో ఆదివారం మేడ్చల్ జిల్లా స్థాయి కిడ్స్ అథ్లెటిక్స్ క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ క్రీడా పోటీల్లో జిల్లా పరిధిలోని వివిధ పాఠశాలల నుంచి అండర్- 8, 10, 12 ఏజ్ గ్రూప్‌ల బాల బాలికలు పాల్గొన్నారు. ఈనెల 7న రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న అథ్లెటిక్స్ క్రీడా పోటీలకు జిల్లా జట్టు ఎంపికలను నిర్వహించారు. ఈ సందర్భంగా కూరపాటి రాజశేఖర్ మాట్లాడుతూ మేడ్చల్ జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి క్రీడాపోటీల్లో ప్రాతినిధ్యం వహించడానికి 15మంది క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు వివరించారు. 50, 100, 300, 400, 600 మీటర్ల స్టాండింగ్ బ్రాడ్ జంప్, తదితర క్రీడా పోటీలను నిర్వహించి ఆ క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 15మంది కీడ్రాకారులను ఎంపిక చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆర్గనైజర్లు, క్రీడాకారుల తల్లిదండ్రులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతే గురువులకు ఆనందం


తాండూరు రూరల్: ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు


ఘట్‌కేసర్: జడ్పీ హైస్కూల్ 1986-87 బ్యాచ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

తాండూరు రూరల్, జూన్ 30: విద్యార్థుల ఉన్నతే గురువులకు ఆనందమని తాండూరు మండల జినుగుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి అన్నారు. పూర్వ విద్యార్థులు బి.శ్రీధర్‌గౌడ్, మహేష్ ఆధ్వర్యంలో ఆదివారం తాండూరు మండలం జినుగుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-2005 సంవత్సరానికి చెందిన పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులంతా అప్పట్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గురువాచారి, ఆసిరెడ్డి, సంగప్ప, బాలయ్య, కేశవరెడ్డి, మౌలానా, పూర్వవిద్యార్థులు అనిత, రాధ, నరేష్‌గౌడ్, గోపాల్, మల్లేష్, విజయ్‌కుమార్, సుమలత, అలివేలు, లక్ష్మయ్య, రాజు రాథోడ్, వెంకటేష్‌గౌడ్, అంబాదాస్, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లోని జడ్పీ హైస్కూల్‌లో 1986 - 87సంవత్సరంలో 10వతరగతి పూర్తిచేసిన విద్యార్థులు ఆదివారం పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలోని ఓప్రైవేట్ హోటల్‌లో సమావేశమయ్యారు. అప్పట్లో విద్య నేర్పిన గురువులను ఘనంగా సన్మానించి పాదాభివంధనం చేసి గతస్మృతులను గుర్తుచేసుకున్నారు. 37సంవత్సరాల కిందటి రోజులు కళ్లముందు కదలాడయని పలువురు విద్యార్థులు అన్నారు.

ఏపీ టూ హైదరాబాద్ గంజాయి రవాణా

- రూ.8 లక్షల విలువ చేసే ఎండు గంజాయిని పట్టుకున్న పోలీసులు
- ముగ్గురు అరెస్ట్, ఒకరు పరారీ


నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

పేట్‌బషీరాబాద్, జూన్ 30: ఏపీ నుంచి నగరానికి గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 33 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను మేడ్చల్ జోన్ ఎస్‌ఓటీ డీసీపీ శ్రీనివాస్, పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు, ఎస్‌ఓటీ సీఐ శ్యామ్‌సుందర్‌రెడ్డి, శామీర్‌పేట్ సీఐ శ్రీనాథ్‌లతో కలిసి మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి ఆదివారం వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్, ఏలూరు మండలానికి చెందిన గేదెల సతీష్(34) కృష్ణా జిల్లా గన్నవరానికి చెందిన కొరాడ సాయికుమార్(26) విశాఖపట్నం చంద్రయ్యపేటకు చెందిన బండారు శివకుమార్(27), ఒడిస్సాకు చెందిన శివ రాజమండ్రిలో ఉంటూ ఒక ముఠాగా ఏర్పడ్డారు. ఈజీ మనీ కోసం అలవాటు పడి గంజాయి సరఫరా చేయాలని నిర్ణయించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి పనసపండ్ల లోడ్ మధ్యలో 16 బండిల్స్‌లో 33 కేజీల ఎండు గంజాయిని హైదరాబాద్‌కు తీసుకొస్తున్నారు. అయితే ముందు రెండు కిలోమీటర్ల మేర పోలీసుల కదలికలను గమనించేందుకు ఒక పైలెట్ వాహనాన్ని ఏర్పాటు చేసుకొన్నారు. గంజాయి సరఫరా చేసే వారికి వీరు ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేస్తున్నారు. పక్కా సమాచారం అందుకున్న మేడ్చల్ జోన్ ఎస్‌ఓటీ, శామీర్‌పేట పోలీసులు సంయుక్తంగా శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓఆర్ఆర్ ఎగ్జిట్ నుంచి కరీంనగర్‌కు వెళ్లే రాజీవ్ రహదారిలో వాహనాలను తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఏపీ 39 యూయూ 4550 నెంబరు గల వాహనం, ఏపీ 39 హెచ్‌జీ 9909 కారును ఆపి తనిఖీ చేశారు. పనస పండ్ల లోడ్‌లో 33 కేజీల గంజాయిని పోలీసులు గుర్తించి రవాణా చేస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. తర్వాత తమదైన శైలిలో విచారించగా గంజాయిని ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్ శివారుప్రాంతాల్లో విక్రయించేందుకు తీసుకు వెళ్తున్నట్లు అంగీకరించారు. వీరి నుంచి రూ.8 లక్షల విలువ చేసే 33 కిలోల గంజాయి, రెండు వాహనాలు, 4 సెల్‌ఫోన్లు, రూ.50 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి తెలిపారు. నలుగురు నిందితుల్లో శివ పరారీలో ఉండగా, సతీష్, సాయికుమార్, శివకుమార్‌లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సతీష్‌పై ఆంధ్రప్రదేశ్‌లో 4, సాయికుమార్‌పై 2 కేసులున్నాయని, వీరిద్దరూ పాత నేరస్తులన్నారు. గంజాయిని పట్టుకున్న ఎస్‌ఓటీ, పోలీసులకు సీపీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. త్వరలోనే వీరికి రివార్డును అందజేయనున్నట్లు డీసీపీ తెలిపారు.

క్రైం కార్నర్

పరిగిలోని పలు ఇళ్లలో చోరీలు

- 15 తులాల బంగారం, లక్షా 29 వేల నగదు అపహరణ


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం


ఇంట్లో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

పరిగి, జూన్ 30: పరిగి పట్టణంలో గల టీచర్స్‌కాలనీలో శనివారం అర్ధరాత్రి పలు ఇళ్లలో చోరీ జరిగింది. తాళాలు వేసి ఉన్న ఇళ్లలోనే చోరీకి పాల్పడ్డారు. ఒకే కాలనీలో ఆరు ఇళ్లలో చోరీ జరిగింది. అయితే మేజర్‌గా ఒక ఇంట్లో భారీగా దొంగతనం జరిగింది. టీచర్స్‌కాలనీలో నివాసముంటున్న బంద్యానాయక్ అనే లైబ్రేరియన్ ఇంటికి తాళంవేసి స్వగ్రామమైన బండవెల్కిచర్లకు వెళ్లారు. శనివారం అర్ధరాత్రి తర్వాత దొంగలు ఇళ్ల తాళాలు విరగ్గొట్టి లోపలికి చొరబడ్డారు. బంద్యా నాయక్ ఇంట్లో బీరువాలను పగులగొట్టి బీరువాలో ఉన్న 12తులాల బంగారం, రూ.1.25లక్షల నగదును తీసుకెళ్లారు. శ్రీకాంత్ ఇంట్లో మూడున్నర తులాల బంగారం, రూ.4వేల నగదును అపహరించారు. అదేవిధంగా ఆనంద్‌రావు, శ్రీనివాస్, సాయిరాం, దశరథ్ ఇళ్లలోనూ చోరీ జరిగింది. వీరి దగ్గర ఏం లభించకపోవడంతో దొంగలు ఇంట్లోని సామగ్రిని చిందరవందరగా పడేసి వెళ్లారు. దొంగతనాలు జరిగిన ఇళ్లలో క్లూస్ టీం బృందం సందర్శించి ఆధారాలు సేకరించారు. దొంగతనం జరిగిన ఇళ్లలోని సీసీ ఫుటేజీ ఆధారంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్ తెలిపారు. ఒకే రోజు రాత్రి ఆరు ఇళ్లలో చోరీ జరగడంతో ఐదారుగు దొంగలు ఉంటారని అనుమానిస్తున్నారు. పోలీసుల వైఫల్యం వల్లే చోరీలు జరుగుతున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు.

మనస్తాపంతో విద్యార్థిని ఆత్మహత్య


జయశ్రీ (ఫైల్)

దోమ, జూన్ 30: పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షా ఫలితాల్లో ఫెయిల్ అయ్యాననే మనస్తాపంతో ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. మండలంలోని శివారెడ్డిపల్లి తండాకు చెందిన పత్యానాయక్, కేసీబాయికి ముగ్గురు కుమార్తెలు. ముగ్గురు ఆడపిల్లలు ఉండటంతో ఎలాగైనా బాగా చదివించాలన్న ఆకాంక్షతో తల్లిదండ్రులు పడుతున్న కష్టాలు అన్నీఇన్నీ కావు. ప్రకృతి సహకరించకపోవడం, మరో పక్క జీవన గమనంలో కష్టాలు ఎదురు కావడంతో సొంత గ్రామాన్ని వదిలి హైదరాబాద్‌లో కూలీ పనులు చేసుకుంటూ పిల్లలను చదివిస్తున్నారు. ఈక్రమంలో వారి చిన్న కూతురు జయశ్రీ(17) ఇంటి దగ్గరే తాత దగ్గర ఉంటూ పరిగి పట్టణంలోని నెం.1 పాఠశాలలో పదోతరగతి చదువుతూ ఇటీవలే జరిగిన పరీక్షల్లో సామాన్యశాస్త్రంలో ఫెయిల్ అయింది. తల్లిదండ్రులు తిరిగి సప్లిమెంటరీ పరీక్ష ఫీజును చెల్లించడంతో పరీక్ష రాసింది. కానీ సప్లిమెంటరీ పరీక్షల్లో మళ్లీ ఫెయిల్ కావడంతో విద్యార్థిని జయశ్రీ మనస్తాపానికి గురైంది. దీంతో రెండు రోజుల కిందట తన తల్లిదండ్రులు ఉంటున్న హైదరాబాద్‌లోని వనస్థలిపురంకు వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో శనివారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు జయశ్రీని ఆసుపత్రికి తరలించినప్పటికీ అప్పటికే మృతి చెందడంతో కన్నీటి పర్యంతమయ్యారు. ఆదివారం స్వగ్రామం శివారెడ్డిపల్లి తండాలో అంత్యక్రియలు నిర్వహించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి

పూడూరు, జూన్ 30: గుర్తుతెలియని వాహనం ఢీ కొని ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన దోమ మండలంలో చోటుచేసుకుంది. గూడూరుకు చెందిన లక్ష్మమ్మ(62) పీరంపల్లిలోని అంతమ్మ వద్దకు నడుచుకుంటూ వెళ్తోంది. రాకంచర్ల గ్రామ శివారులోని రాగానే అర్ధరాత్రి గుర్తుతెలియని వాహనం లక్ష్మమ్మను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వృద్ధురాలి తల నుజ్జునుజ్జయి కాళ్లు, చేతులు, నడుము భాగంలో తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. భర్త వడ్డె వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు చెన్‌గోముల్ ఎస్ఐ మధుసూదనరెడ్డి తెలిపారు.

నకిలీ సర్టిఫికెట్ల బాగోతం

- పోలీసులకు ఫిర్యాదు చేసిన మంచాల తహసీల్దార్
- కేసు నమోదు.. కొనసాగుతున్న పోలీసు దర్యాప్తు


మంచాల తహసీల్దార్ కార్యాలయం

మంచాల, జూన్ 30 : నకిలీ సర్టిఫికెట్ల బాగోతం మంచాల తహసీల్దార్ కార్యాలయంలో వెలుగులోకొచ్చింది. ఈ ఘటనపై తహసీల్దార్ ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మంచాల తహసీల్దార్ కార్యాలయంలో షేక్ సమీర పేరిట 19 మార్చి 2024న ఆదాయ ధ్రువీకరణ పత్రం జారీ చేశారు. ఆమె విదేశాల్లో చదువు నిమిత్తం ఈ సరిఫికెట్‌ను జతపరుస్తూ రాష్ట్ర మైనారిటీ వెల్ఫేర్ సొసైటీకి సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌లో భాగంగా మైనారిటీ వెల్ఫేర్ సొసైటీ నుంచి ఆదాయ ధ్రువీకరణ పత్రంపై నిజనిర్ధారణకు వారం రోజుల క్రితం తహసీల్దార్ ప్రసాద్‌రావుకు ఉత్తర్వులందాయి. అయన సర్టిఫికెట్‌పై క్షేత్ర పరిశీలనను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అప్పగించారు. రెవెన్యూ అధికారులు జారీచేసిన సర్టిఫికెట్ ప్రకారం ఉన్న చిరునామాకు వెళ్లగా ఆ అడ్రస్‌లో షేక్ సమీర పేరుతో ఎవరూ లేరని తేలింది. దీంతో ధ్రువీకరణ పత్రం జారీ వివరాలను తహసీల్దార్ కార్యాలయంలోని కంప్యూటర్ విభాగంలో తనిఖీ చేశారు. అందులో ఆన్‌లైన్ ఇన్‌వార్డు ఎంట్రీలో ఎటువంటి రాతపూర్వక పత్రాలు అప్‌లోడ్ కాలేదు. ఈ క్రమంలో దరఖాస్తులో ఉన్న ఫోన్‌నంబర్‌ను క్లిక్‌చేయగా ఇదే నంబర్‌తో మరిన్ని దరఖాస్తులు సిస్టంలో చూపారు. ఇలా అప్లై చేసిన దరఖాస్తులన్నింటిని ఆన్‌లైన్ అప్లికేషన్ స్థానికంగా కాకుండా నగర శివారు వివిధ ప్రాంతాల్లోని మీసేవ కేంద్రాల నుంచి దరఖాస్తు చేసినట్టు నిర్ధారించారు. సదరు ఫోన్‌నంబర్‌తో గతంలో జారీ చేసిన ఆదాయ సర్టిఫికెట్ తప్పుడు సర్టిఫికెట్‌గా నిర్ధారించిన తహసీల్దార్.. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై మంచాల ఎస్సై రవినాయక్ మాట్లాడుతూ నకిలీ సర్టిఫికెట్ల జారీ వ్యవహారంపై తహసీల్దార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని చెప్పారు. ప్రాథమిక దర్యాప్తు ఆధారంగా తహసీల్దార్ కార్యాలయంలో ఆపరేటర్‌గా పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సురేష్, నగర శివారు మీసేవ కేంద్రం నిర్వాహకుడు రాజు, దరఖాస్తుల్లో భాగస్వాములుగా ఉన్న మరో ఇద్దరిపై కేసు నమోదు చేశామని తెలిపారు. నిందితులంతా పరారీలో ఉన్నారని, వారిని అదుపులోకి తీసుకుని విచారించి పూర్తి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. ఈ నకిలీ బాగోతంపై తహసీల్దార్ ప్రసాద్‌రావు మాట్లాడుతూ సర్టిఫికెట్ల జారీలో చోటుచేసుకున్న అవకతవకలపై ఆర్డీవో, కలెక్టర్లకు నివేదికిచ్చామని తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశామని తదుపరి ఉత్తర్వుల ప్రకారం చర్యలుంటాయన్నారు.

ఫ్లెక్సీ కడుతుండగా.. విద్యుదాఘాతంతో యువకుడు మృతి

శంషాబాద్, జూన్ 30 : శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని ఓ టైలర్ షాపుకు ఫ్లెక్సీ కడుతుండగా విద్యుత్ షాక్ తగలడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఆర్జీఐఏ పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఊట్‌పల్లి బస్తీలో నివాసముండే అశోక్‌కుమార్(23) శంషాబాద్ ఎయిర్‌పోర్టులోని ఓ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేసేవాడు. ఈక్రమంలో అతడు విధులకు వెళుతుండగా.. శంషాబాద్-షాబాద్ రోడ్డులో ఉన్న ఓ టైలర్‌షాపు వద్దకు వెళ్లాడు. అక్కడ షాపు ఓనర్ తన దుకాణానికి సంబంధించిన ఫ్లెక్సీ కట్టమని కోరాడు. అశోక్‌కుమార్ ఫ్లెక్సీ తీసుకొని కడుతుండగా.. విద్యుత్ వైర్లు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య మేనక టైలర్ షాపు యాజమాని తగిన జాగ్రత్తలు తీసుకోకుండా తన భర్తను ఫ్లెక్సీ కట్టమని చెప్పినందునే విద్యుత్‌షాక్ తగిలి మృతిచెందాడని ఆరోపించింది. ఈమేరకు యాజమానిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు సీఐ బాల్‌రాజ్ తెలిపారు. కేసు ఆర్జీఐఏ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ బోల్తా.. తప్పిన పెను ప్రమాదం

షాద్‌నగర్, జూన్ 30 : రోడ్డు మూల మలుపు వద్ద ట్రాక్టర్ బోల్తాపడిని ఘటన ఫరూఖ్‌నగర్ మండలం నాగులపల్లి నుంచి షాద్‌నగర్ వెళ్లే రోడ్డు మార్గంలో చోటుచేసుకుంది. ఫరూఖ్‌నగర్ దాటిన తర్వాత వైకుంఠధామం సమీపంలో ఉన్న మలుపు ప్రమాదకరంగా ఉంది. మలుపులో ఒక చోట రోడ్డు రెండు వైపులా కొట్టుకు పోయింది. దాంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం ఉదయం మలుపు వద్ద అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తాపడింది. కాగా, ప్రాణ నష్టం ఏమీ జరగలేదు. రోడ్డు రెండు దెబ్బతిందని నాగులపల్లి గ్రామస్తులు తెలిపారు. రాత్రి పూట వాహనాల్లో వెళ్లాలంటే భయమేస్తోందని ఆందోళన చెందుతున్నారు. మలుపుల వద్ద చెట్లు ఏపుగా పెరగడంతో వాహనాలు కనిపించడం లేదని తెలిపారు.